



# కరపత్రం

SINCE 2014

సోమవారం నవంబర్ 10 2025 | సంపుటి : 2 | సంచిక : 36 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## మోదీ సభకు హాజరైన విద్యార్థులకు అదనపు మార్కులు.. ఫ్యాక్ట్ చెక్‌లో ఏం తేలిందంటే?




ఉత్తరాఖండ్‌లోని దేవ్ భూమి యూనివర్సిటీ లో ఆదివారం జరగనున్న కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఆ సభకు హాజరైన విద్యార్థులకు పరీక్షల్లో అదనంగా 50 అంతర్గత మార్కులు వేస్తామని యూనివర్సిటీ జారీ చేసినట్లుగా ఉన్న ఓ నోటీసు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అందులో దేవ్ భూమి ఉత్తరాఖండ్ విశ్వవిద్యాలయానికి చెందిన అన్ని విభాగాల విద్యార్థులు ప్రధాని కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని..దీనిని భారతీయ జ్ఞాన పరంపర (భారతీయ జ్ఞాన వ్యవస్థ) కోర్సు కింద పరిగణిస్తామని తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు 50 అంతర్గత మార్కులు కేటాయిస్తామని వెల్లడించారు.

పేజి 2లో ▶

## ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో మాదే అధికారం:



భాజపా, ఆరెస్సెస్‌లు దేశాన్ని విభజించేందుకు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

2లో

## ఆడ్వాణీపై శశిథరూర్ ప్రశంసలు




మోదీ సర్కారు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ . తాజాగా భాజపా సీనియర్ నేత ఆడ్వాణీని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

రాజకీయ నాయకుడిగా ఆడ్వాణీ దేశానికి ఎంతో సేవ చేశారని..జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ మాదిరిగా ఒక్క సంఘటన ఆధారంగా దశాబ్దాలుగా ఆయన చేసిన ప్రజా సేవను అంచనా వేయకూదని థరూర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

"ఆడ్వాణీ దేశ ప్రజలకు చేసిన సుదీర్ఘ సేవను ఒకే ఒక్క కారణం చూపించి తగ్గించడం అన్యాయం. నెహ్రూ రాజకీయ జీవితాన్ని చైనా ఎదురుదెబ్బ ద్వారా ఇందిరా గాంధీ రాజకీయ జీవితాన్ని ఆమె విధించిన అత్యవసర పరిస్థితి ద్వారా మాత్రమే నిర్వచించలేనట్లే, ఆడ్వాణీకి కూడా అదే న్యాయం వర్తిస్తుంది" అని థరూర్ పేర్కొన్నారు.

పేజి 2లో ▶

# ఆరోగ్యం లేకుంటే ఎన్ని ఆస్తులున్నా నిరుపయోగమే: సీఎం చంద్రబాబు




- ఆరోగ్యమే ప్రధానం: సంపద, బంగ్లాలు, కార్లు, హోదా ఎన్ని ఉన్నా... మంచి ఆరోగ్యం లేకపోతే నిరుపయోగం అని, అనారోగ్యమే నిజమైన పేదరికం అని సీఎం చంద్రబాబు తెలిపారు.
- సంజీవని ప్రాజెక్టు: ప్రపంచంలో ఆరోగ్యానికి సంబంధించిన నాలెడ్జ్ ఎక్కడ ఉన్నా... రోగి ఇంటి వద్దే వైద్యం అందించేలా 'సంజీవని ప్రాజెక్టు' పనిచేయబోతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు.
- హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్: రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది హెల్త్ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు.

గుంటూరు: ప్రపంచంలో ఆరోగ్యానికి సంబంధించిన నాలెడ్జ్ ఎక్కడ ఉన్నా .. రోగి ఇంటి వద్దే వైద్యం అందించేలా 'సంజీవని ప్రాజెక్టు' పనిచేయబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో శంకర ఐ ఆసుపత్రి భవనాన్ని సీఎం ప్రారంభించారు. "రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది హెల్త్ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి.. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. రాబోయే రోజుల్లో.. ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఏపీ ఒక రోల్ మోడల్‌గా ఉంటుంది. సంపద, బంగ్లాలు, కార్లు, హోదా ఎన్ని ఉన్నా.. మంచి ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. అనారోగ్యమే నిజమైన పేదరికం. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు శంకర్ ఐ ఆసుపత్రి చేస్తున్న కృషిని అభినందిస్తున్నా.

శంకర ఐ ఫౌండేషన్ సేవలు బాగున్నాయి. నేపాల్, కాంబోడియా, నైజీరియాలోనూ శంకర ఐ ఆసుపత్రులు ఉన్నాయి. కంచి పీఠం పిలుపునిస్తే అనేకమంది దాతలు స్పందిస్తారు. రెయిన్‌బో కార్యక్రమం ద్వారా పిల్లల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు 32వేల వైద్య శిబిరాలు నిర్వహించి.. దాదాపు 30లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు చేశారు. రోజుకు 750 మందికి కంటి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. శంకర ఐ ఆసుపత్రిని ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నా. హిందూ ధర్మ పరిరక్షణకు కంచి మఠం అనేక కార్యక్రమాలు చేస్తోంది. పూరి, శృంగేరిలో పీఠాలు స్థాపించి హిందూ ధర్మాన్ని రక్షిస్తున్నారు" అని సీఎం అన్నారు.

పేజి 2లో ▶

# రాసిపెట్టుకోండి.. 2034 వరకూ మాదే అధికారం: 'మీట్ ది ప్రెస్'లో సీఎం రేవంత్



- జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది.
- నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పునాది వేసిన ఐటీ రంగం కీలకమైంది.
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకం.
- గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలే హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయని తెలిపారు.
- గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు నగరంలో ఏర్పాటయ్యాయి.

హైదరాబాద్: రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలను వారు ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

"జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పునాది వేసిన ఐటీ రంగం నగర అభివృద్ధికి కీలకంగా మారింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయి. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు నగరంలో ఏర్పాటయ్యాయి. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం ఇక్కడికే వచ్చాయి. ప్రపంచాన్నే శాసించే సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి.


పేజి 2లో ▶

## ఇన్నాళ్లూ సీఎం రేసులో ఒక్కరే.. ఇప్పుడు ఇద్దరు: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



2లో

## రామచంద్రాపురంలో బాలిక మృతి ఘటన.. వీడిన మిస్టరీ!



2లో

## ఏపీలో జరిగిన దాన్ని దృష్టిలో ఉంచుకుని బిహార్ యువత మేల్కోవాలి: మంత్రి నారా లోకేశ్




- బిహార్ యువతకు పిలుపు: ఏపీలో గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బిహార్ యువత మేల్కోవాలి అని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.
- ఎన్డీయేను గెలిపించాలని విజ్ఞప్తి: బిహార్ అభివృద్ధి కోసం మరోసారి ఎన్డీయే కూటమిని గెలిపించాలని ఆయన కోరారు.
- బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

పట్నా: బిహార్ అభివృద్ధి కోసం మరోసారి ఎన్డీయే కూటమిని గెలిపించాలని ఏపీ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిహార్ వెళ్లిన ఆయన.. పట్నాలో మీడియా సమావేశం నిర్వహించారు."బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. నీతీశ్ సర్కార్‌కు ముందు బిహార్‌లో జంగిల్‌రాజ్ ఉండేది. ప్రస్తుతం అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. పట్నాలో పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడాను. ఇక్కడి అభివృద్ధి పనులు, ప్రభుత్వ విధానంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అత్యధికంగా బిహార్‌కు నిధులు కేటాయించారు. బిహార్ తర్వాత ఏపీకి బడ్జెట్‌లో అధిక నిధులు ఇచ్చారు. రెండు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉండటమే ఇందుకు కారణం. పరిశ్రమల రాకతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి.అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మార్చడం సరికాదు. ప్రభుత్వం మారితే నష్టం జరుగుతుంది. గతంలో ఏపీలో ఒక్క ఛాన్స్ పేరుతో ఓ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత పరిశ్రమలన్నీ పారిపోయాయి. ఏపీలో జరిగిన దాన్ని దృష్టిలో ఉంచుకుని బిహార్ యువత మేల్కోవాలి. వికాస్ భారత్ సాధించాలంటే బిహార్ అభివృద్ధి ముఖ్యం. ఇక్కడి యువత, ఓటర్లు మరోసారి ఎన్డీయేను గెలిపించాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు.



## కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్



పలమనేరు: చిత్తూరు జిల్లాలో కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. పలమనేరు మండలం ముసలిమడుగులో 20 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి 4 కుంకీ ఏనుగులను తెచ్చినట్లు పవన్ కల్యాణ్‌కు అధికారులు తెలిపారు. వీటి ద్వారా జనావాసాలు, పొలాల్లోకి వచ్చే అడవి ఏనుగులను ఎలా కట్టడి చేస్తారో వివరించారు. కుంకీ ఏనుగుల విన్యాసాలను పవన్ కల్యాణ్ తిలకించారు. వాటికి ఆహారం తినిపించారు.

# అమెరికాలో జవహర్‌లాల్



జోహ్రాన్ మమ్దానీ అనే ఒక ముస్లిం అడ్వకేట్ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికయ్యాడు. ఆయన విజయంలో అనేక ప్రత్యేకతలున్నాయి. జోహ్రాన్ భారత సంతతికి చెందినవాడు. తల్లి మీరా నాయర్ హిందువు, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన దర్శక నిర్మాత. తండ్రి మహమూద్ మమ్దానీ కూడా భారతీయ ముస్లిం. కొలంబియా విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్. బహుగ్రంథాల రచయిత. ఇదే న్యూయార్క్ నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు చెందిన రెండు టవర్లను 2001 సెప్టెంబరు 11న (9/11) అల్‌ఖైదా ఉగ్రవాదులు కూల్చివేసిన విషయం మనందరికీ తెలుసు. ఆ తరువాత ఇస్లాం సంస్కృతి సంప్రదాయాల్లోనే ఉగ్రవాదం వుందంటూ అమెరికా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం మొదలెట్టింది. దీనినే ఇస్లామోఫోబియా అంటున్నాం. ఈ ప్రచారంలోని బూటకాన్ని బయటపెడుతూ మహమూద్ మమ్దానీ 'మంచి ముస్లిం, చెడ్డ ముస్లిం' అనే గ్రంథాన్ని రాసి ప్రచురించాడు. 1979లో సోవియట్ రష్యా ఆఫ్ఘనిస్థాన్‌ను ఆక్రమించినపుడు, ఆఫ్ఘన్ గెరిల్లాలకు ఆయుధాలు, డబ్బు సరఫరాచేసి, పాకిస్థాన్ సహకారంతో వారికి అమెరికా ఉగ్రవాద శిక్షణ ఇచ్చిందనీ, రోనాల్డ్ రీగన్ అధ్యక్షునిగా వుండగా ఆఫ్ఘన్ గెరిల్లాలను వైట్ హౌస్‌కు ఆహ్వానించి వాళ్లను స్వాతంత్ర్య సమరయోధులుగా పొగిడారనీ మమ్దానీ తగిన ఆధారాలతో ఈ పుస్తకంలో వివరించాడు.

మహమూద్ మమ్దానీ, మీరా నాయర్ ఉగాండాలో పనిచేస్తున్న కాలంలో వాళ్లకు జోహ్రాన్ మమ్దానీ జన్మించాడు. జోహ్రాన్ ఏడేళ్ల వయస్సులో వున్నప్పుడు మమ్దానీ కుటుంబం అమెరికాకు మారింది. జోహ్రాన్ ఈ ఏడాదే డిజిటల్ క్రియేటర్ రమా దువాజీని జోహ్రాన్ దుబాయ్‌లో నిఖా చేసుకున్నాడు. అలా వారిది ఒక రకంగా వసుధైక కుటుంబం. న్యూయార్క్‌లో జోహ్రాన్ అడ్వకేట్‌గా స్థిరపడి మానవహక్కుల కార్యకర్తగా పనిచేస్తున్నాడు. అమెరికా ఎన్నికలు జోహ్రాన్‌కు కొత్తకాదు. న్యూయార్క్ శాసనసభకు అస్టోరియ (క్వీన్స్) నియోజకవర్గం నుంచి 2020లో పోటీ చేసి ఐదు వరుస విజయాలున్న ఘనాపాఠిని ఓడించాడు. 2022, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుతం అతను శాసనసభ్యుడు. ప్రపంచ రాజధానిగా భావించే న్యూయార్క్ నగరాన్ని సహజంగానే ప్రపంచ ధనవంతులు ఏలుతుంటారు. వాళ్లలో అత్యధికులు యూదులు. వాళ్లే రాజకీయ రంగాన్నీ శాసిస్తుంటారు. మీడియా కూడ వాళ్ల చెప్పుచేతల్లోనే వుంటుంది. వీళ్లను ఒలిగార్కి అంటారు. ఒలిగార్కి అండదండలు లేకుండా ఎవరూ అక్కడ ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేదు. మేయర్ బరిలో దిగినప్పుడు జోహ్రాన్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఒక చేత్తో ప్లకార్డ్, మరో చేతిలో మైక్ పట్టుకుని ప్రసంగిస్తూ వీధుల్లో నడుస్తుంటే ఒక్కరూ తలతిప్పి చూసేవారు కాదు. పోటీలో పదిమంది వుంటే మీడియా అతనికి పదో ర్యాంకు ఇచ్చింది. జోహ్రాన్ వయస్సు ఇప్పుడు 34 సంవత్సరాలు. జీ జెనరేషన్ సంప్రదాయం తెలిసినవాడు. న్యూయార్క్‌లో ధనవంతుల్ని అతను అస్సలు పట్టించుకోలేదు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేదల్ని లక్ష్యంగా పెట్టుకుని తన ప్రచారాన్ని సాగించాడు. 'గోదాంలో పెట్టెలు మోసి నీలి మచ్చలు పడ్డ వేళ్లు, డెలివరీ సైకిల్ హ్యాండిల్స్ వల్ల గట్టిగా మారిన అరచేతులు, కిచెన్‌లో కాలిన గాయాలు ఉన్న మునివేళ్లు. ఇలాంటి చేతులకు అధికారాన్ని పట్టుకునే అవకాశం ఎవరూ ఇక్కడ ఇవ్వరు'. 'ప్రతి అడ్డంకినీ దాటి, ఒక మహా రాజకీయ వంశాన్ని కూల్చివేసి, మన భవిష్యత్తును మన చేతులతో పట్టుకుందాం' వంటి మాటలు అణగారినవారికి గొప్ప ఉత్తేజాన్నిచ్చాయి.

ఎదురీదడం జోహ్రాన్ నైజం. అతను ముస్లిం అనీ, అవకాశం ఇస్తే 9/11 టెర్రరిస్టు సంఘటనలు పునరావృతం అవుతాయని ప్రచారం మొదలెట్టారు ప్రత్యర్థులు. 'శరణార్థి, చొరబాటుదారుడు' అన్నవాళ్లూ వున్నారు. దానికి అతను భుజాలు తడుముకోలేదు. 'అవును నేను ముస్లింను. ముస్లిం ఆచార వ్యవహారాలను పాటిస్తాను' అంటూ తాను ఇష్టంగా బిర్యాని తింటున్న విడియోను సోషల్ మీడియాలో పెట్టిన గడుసరి.

ప్రపంచంలో యూదులు అత్యధికంగా నివసిస్తున్న నగరం న్యూయార్క్. అలాంటి నగరంలో ఏ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా ముందు యూదు పెద్దల ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకోవడం సంప్రదాయం. తాము గెలిస్తే ముందు ఇజ్రాయెల్ వెళతామని ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వాగ్దానం చేస్తుంటారు. జొహ్రాన్ మహామొండి. తాను మేయర్‌గా గెలిస్తే, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును న్యూయార్క్‌లో కాలుపెట్టనీయనని ప్రకటించాడు. 'ఒకవేళ అతను వస్తే, అరెస్టు చేస్తాను' అని కరాఖండీగా చెప్పాడు. యుద్ధనేరాలకు పాల్పడినందుకు నెతన్యాహు మీద ఏడాది క్రితం ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఒక అరెస్టు వారెంటు జారీచేసిన విషయం తెలిసిందే.

న్యూయార్క్ మహానగరంలో జోహ్రాన్ ఒక సామాజికార్థిక సరిహద్దు గీత గీశాడు. ఉన్నోళ్లు తన ప్రత్యర్థులు, లేనోళ్లే తన మద్దతుదారులు. పేదల ఇంటింటికి వెళ్లి వాళ్ల కష్టాలు తెలుసుకున్నాడు. వాటి పరిష్కారాల కోసం పథకాలు ప్రకటించాడు. హెల్త్ కేర్, ఇంటి రెంటు, సొంతిల్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాల మీద జోహ్రాన్ ప్రకటించిన సంక్షేమ పథకాలు జనాకర్షణగా మారాయి. ఒక అడ్వకేట్‌గా మానవ హక్కుల పరిరక్షణ కోసం అతను చేస్తున్న కృషికి కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు ఏర్పడ్డారు. సోషల్ మీడియాలో అతని భార్య సాగించిన ప్రచారం కూడా బాగా పనిచేసింది. క్రమంగా అతని మద్దతుదారులు పెరిగారు. మమ్దానీ రేసులో దూసుకుపోతున్నాడనే సంకేతాలు రాగానే ఒలిగార్కి తన దగ్గరున్న పావులన్నీ కదిపింది. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మమ్దానీని హేళన చేశాడు. అతణ్ణి మేయర్‌గా ఎన్నుకుంటే న్యూయార్క్ నగరానికి ఫెడరల్ నిధుల్లో కోత విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించాడు. డెమోక్రాటిక్ పార్టీకే చెందిన అమెరికా మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా సైతం మమ్దానీ కోసం ప్రచారం చేయడానికి నిరాకరించాడు.

సాహిత్యంతో పరిచయం ఉన్నవాళ్లకు మమ్దానీ ఉపన్యాస శైలి జాక్ లండన్ నవల 'ఉక్కుపాదం' (ఐరన్ హీల్)లోని కథానాయకుడు ఎర్నెస్ట్ ఎవ్వర్ హార్డ్‌ను గుర్తుకు తెచ్చింది. సామాజిక ఉద్యమాలతో పరిచయం వున్నవాళ్లకు ముస్లిం మస్జీద్ నిర్మాత, ఆఫ్రో అమెరికన్ ఉద్యకారుడు మాల్కమ్%-%ఎక్స్ను గుర్తుకు తెచ్చింది. ప్రత్యర్థులు మమ్దానీని కమ్యూనిస్టు, మార్క్సిస్టు, రాడికల్ అన్నారు. ఈ మాటలతో న్యూయార్కీయులు భయపడతారని అనుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా జరిగింది. ఇస్లామోఫోబియా రాజ్యం చేస్తున్న చోట ఒక ముస్లింను ఎన్నుకున్నారు. వలసదారుల భరతం పడతానంటూ దేశాధ్యక్షుడు రంకెలు వేస్తున్న చోట ఒక వలసదారుడిని గెలిపించారు. ఇదేమీ విప్లవం కాదుబీ అక్కడేమీ సోషలిస్టు రాజ్యం ఏర్పడడంలేదు. కాకపోతే, ప్రధానంగా ఇది అమెరికాలో అణగారిన సమూహాలకు ఆత్మగౌరవ విజయం!

ఆర్థిక విధానాల్లో రిపబ్లికన్స్, డెమొక్రాట్స్ మధ్య పెద్ద తేడాలేదు. డెమోక్రాట్స్‌లో జోహ్రాన్ నిస్సందేహంగా వామపక్షం. మనకు కూడా కాంగ్రెస్‌లో ఒకప్పుడు కుడిపక్షం, వామపక్షం ఉండేవి. గోపాలకృష్ణ గోఖలే, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ కుడిపక్షంబీ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వామపక్షంగా వుండేవారు. జోహ్రాన్ మమ్దానీ కమ్యూనిస్టు కాదుబీ నక్సలైటూ కాదు. కేవలం సోషల్ డెమోక్రాట్. అతనిప్పుడు అమెరికాలో జవహర్‌లాల్ నెహ్రూ. గెలిచినప్పుడు కూడ అతను నెహ్రూని తలుచుకోవడం యాదృచ్ఛికం కాదు.

'న్యూయార్క్%-% వలసదారులు నిర్మించిన నగరం. వలసదారులు శక్తిమంతంగా తీర్చిదిద్దిన నగరం. ఈ రాత్రి నుంచి అయితే వలసదారులు నడుపుతున్న నగరం. ఇది వలసదారుల నగరంగానే కొనసాగుతుంది. అయ్యా డొనాల్డ్ ట్రంప్ గారూ! నా మాటలు గట్టిగా ఆలకించండి. ఇక్కడ మీరు ఎవరిని తాకాలన్నా మమ్మల్ని అందరినీ దాటుకుని వెళ్లాలి' అంటూ జోహ్రాన్ తన విజయోత్సవ సభలో అన్న మాటలు అమెరికా రాజకీయాల్లో రాబోయే మార్పులకు సంకేతం కావచ్చు.

# రామచంద్రాపురంలో బాలిక మృతి ఘటన.. వీడిన మిస్టరీ!

మొదటి పేజీ తరువాయి

రామచంద్రాపురం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రాపురంలో బాలిక మృతి ఘటనలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నెల 4న ఫ్యాన్‌కు వేలాడుతూ బాలిక మృతదేహం కనిపించింది. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. బాలికను హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మిస్టరీగా మారిన ఈ కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాహుల్ మీనా మీడియాకు వెల్లడించారు.

చిట్టితల్లీ.. ఏం కష్టమొచ్చిందమ్మా!

"బాలిక హత్యకు సంబంధించి కేసు నమోదు చేశాం. నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్టు చేశాం. బాలిక ఉండే భవనంలోనే జిరాక్స్ షాపులో అతడు పనిచేసేవాడు. ఆర్థిక సమస్యలతో నిందితుడు తీవ్ర ఒత్తిడిలోఉన్నాడు. అతడి చెల్లి పెళ్లికి సంబంధించి ఆర్థిక సమస్యలు ఉన్నాయి. నాలుగో తేదీ సాయంత్రం 4.30 గంటలకు బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. సాయంత్రం 5 గంటలకు బాలిక ఇంటికి శ్రీనివాస్ వెళ్లాడు. ఆమె తల్లి లేదని గ్రహించి చోరీ చేయాలనుకున్నాడు. గతంలోనూ బాలిక ఇంటికి ఇతర పనులకు సంబంధించి వెళ్లేవాడు. అక్కడి బెడ్‌రూమ్‌లో విలువైన వస్తువులు ఉన్నాయి. ఈక్రమంలో ఇంట్లోకి ఎందుకు వచ్చావని బాలిక నిందితుడిని ప్రశ్నించింది. తన తల్లికి విషయం చెప్పాలని ప్రయత్నించింది. నిందితుడు శ్రీనివాస్‌కు సంబంధించి ప్రింట్ ఘటనాస్థలిలో దొరికింది. బాలికను అతడే హత్య చేసినట్లు నిర్ధరించాం. సీడీఆర్, సీసీటీవీ పరిశీలిస్తే నిందితుడి లోకేషన్ అదే ప్రాంతంలో ఉన్నట్లు తెలిసింది. మిగతా వారిని విచారించి శ్రీనివాస్‌ను పట్టుకున్నాం. ఆధారాల మేరకు అరెస్టు చేశాం. మరో మెడికల్ రిపోర్టు రావాల్సి ఉంది.. సాంకేతిక ఆధారాల కోసం చూస్తున్నాం." అని ఎస్పీ తెలిపారు.

# చిన్నారుల 'ఊపిరి' ఉక్కిరిబిక్కిరి! - దిల్లీలో నిరసనలు



దేశ రాజధానిలో కాలుష్య తీవ్రతతో గాలి నాణ్యత రోజు రోజుకూ క్షీణిస్తోంది. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ దిల్లీ వాసులు ఆందోళనకు దిగారు. వివిధ వర్గాల ప్రజలు, తల్లిదండ్రులు, పర్యావరణ కార్యకర్తలు ఇండియా గేట్ వద్ద భారీ నిరసన చేపట్టారు. చిన్నారులతో కలిసి అనేక మంది మహిళలు హాజరై.. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

" ప్రజా ప్రతినిధులతో సమావేశం కావాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ నిరాకరించారు. కాలుష్య తీవ్రత వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే తల్లిదండ్రులు భారీ స్థాయిలో వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టారు" అని పర్యావరణవేత్త భావ్రీన్ ఖండారీ పేర్కొన్నారు. ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరి ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, స్వచ్ఛమైన గాలిలో పెరిగే పిల్లలతో పోలిస్తే వీరి జీవితకాలం దాదాపు 10 సంవత్సరాలు తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వచ్ఛమైన గాలిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మరో నిరసనకారుడు ఆరోపించారు. మాజీ సీఎం షీలా దీక్షిత్ హయాంలో దిల్లీ 'గ్రీన్ క్యాపిటల్'గా ఉండేదని, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో చేరిందన్నారు. రాజకీయ నాయకులు మాత్రం బాధ్యత వహించకుండా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇండియా గేట్ వద్ద నిరసనలకు దిగారని పేర్కొంటూ పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# చికెన్ నెక్ సమీపంలో 'ఐఏఎఫ్' విన్యాసాలు.. శత్రువులకు నిద్రలేని రాత్రులు: హిమంత



ఈశాన్య భారత్‌లో వాయుసేన మొట్టమొదటి పూర్తిస్థాయి వైమానిక ప్రదర్శన నిర్వహించింది. అస్సాంలోని గువాహటి గగనతలంపై ఐఏఎఫ్ యుద్ధవిమానాలు గర్జించాయి. ఈస్ట్రన్ ఎయిర్ కమాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎయిర్ షోను అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, సీఎం హిమంత బిశ్వశర్మ, సైనిక ఉన్నతాధికారులు వీక్షించారు. చికెన్ నెక్ కారిడార్ (సిలీగుడీ కారిడార్) సమీపంలో వాయుసేన శక్తిసామర్థ్యాల ప్రదర్శన శత్రువులకు నిద్రలేని రాత్రులు మిగులుస్తుందని ముఖ్యమంత్రి హిమంత పేర్కొన్నారు. "ఈశాన్య ప్రాంతంలో నిర్వహించిన ఈ మొట్టమొదటి ఎయిర్ షో.. వైమానిక దళ సామర్థ్యాలు, నైపుణ్యాలు, స్ఫూర్తిని కళ్లకు కట్టింది. చికెన్ నెక్, నాలుగు అంతర్జాతీయ సరిహద్దులకు దగ్గరగా నిర్వహించిన విన్యాసాలు.. దేశం లోపల, వెలుపల ఉన్న శత్రువులకు నిద్రలేని రాత్రులను మిగులుస్తుంది. 1962 యుద్ధం సమయంలో దాదాపు వదిలేసిన ప్రాంతం నుంచి నేడు వైమానిక దళ పరాక్రమ సందేశాన్ని చేరవేయడం వరకు.. ఈశాన్య భారతం చాలా అభివృద్ధి చెందింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఇది సాధ్యమైంది" అని సీఎం హిమంత ట్వీట్ చేశారు.

వాయుసేన 93వ వార్షికోత్సవం పురస్కరించుకుని 'ఫ్లయింగ్ డిస్‌ప్లే 2025' పేరిట ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రఫేల్, సుఖోయ్-30, మిగ్-29, మిరాజ్, ఐఎల్-78 రీఫ్యూయలర్, సీ-17 గ్లోబ్‌మాస్టర్, ఆంటనోవ్ ఏఎన్-32, సీ-130 హర్క్యులస్ వంటి సైనిక విమానాలు, అపాచీ, ఎంఐ-17, ఏఎల్‌హెచ్-ఎంకే1 వంటి హెలికాప్టర్లతో నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శన వీక్షించేందుకు నగరవాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎయిర్ షో అనంతరం ఏర్పడిన ట్రాఫిక్ రద్దీలో సీఎం హిమంత, గవర్నర్ కూడా చిక్కుకున్నారు.

# ఊడిన స్టీరింగ్ రాడ్.. తాండూరు డిపో ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



యాలాల: తాండూరు డిపో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు మహబూబ్‌నగర్ వెళ్తుండగా.. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలోకి రాగానే స్టీరింగ్ రాడ్ బోల్టు ఊడిపోయింది. దీంతో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై బస్సు వేగంగా వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే.. తమ పరిస్థితి ఏంటని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు స్టీరింగ్ రాడ్ బోల్ట్ ఊడిపోయిన మాట వాస్తవమేనని, ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా మరొక బస్సులో వారి గమ్యస్థానాలకు పంపామని డిపో మేనేజర్ తెలిపారు. ఇటీవలే చేవెళ్ల వద్ద ఆర్టీసీ బస్సు ఘోర ప్రమాదానికి గురై 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

# మోదీ సభకు హాజరైన విద్యార్థులకు అదనపు మార్కులు..

మొదటి పేజీ తరువాయి

దేవ్ భూమి యూనివర్సిటీలో నేడు జరగనున్న మోదీ కార్యక్రమంపై జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వార్తలు తప్పని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి యూనివర్సిటీ యాజమాన్యం ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పేర్కొంది. ఈ ప్రచారాలపై విశ్వవిద్యాలయం కూడా స్పందిస్తూ.. తమ యూనివర్సిటీ పేరిట జరుగుతున్న ప్రచారం నకిలీదని తేల్చిచెప్పింది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న నోటీసుపై సంబంధిత అధికారి సంతకం లేదని.. ఇటువంటి ప్రచారాలను ప్రజలు విశ్వసించవద్దని కోరింది. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న ఖాతాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుభాషిత్ గోస్వామి వెల్లడించారు.

# ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో మాదే అధికారం:

మొదటి పేజీ తరువాయి

భాజపా, ఆరెస్సెస్‌లు దేశాన్ని విభజించేందుకు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఇండియా' కూటమి మాత్రం దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు కృషి చేస్తోందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజు కిషన్‌గంజ్‌లో నిర్వహించిన సభలో ఈమేరకు ప్రసంగించారు. రాష్ట్రంలో ఓట్ల చోరీని అడ్డుకుంటే.. 100 శాతం 'ఇండియా' కూటమిదే అధికారమని పేర్కొన్నారు.

"కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీపై ఆధారాలు చూపించాం. కానీ.. ప్రధాని మోదీ , కేంద్ర మంత్రి అమిత్ షా , సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లు సమాధానం ఇవ్వలేక పోయారు. ఎందుకంటే.. వాస్తవాలన్నీ ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చాయి. మోదీ, అమిత్ షాలు దేశంలో ఎక్కడికెళ్లినా.. చివరకు 'ఓట్ల చోరీ' విషయంలో దొరికిపోతారు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో 'ఇండియా' కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. దీని కోసం యువత, రైతులు, కార్మికులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

మరి గతంలో ఆరెస్సెస్‌ను ఎలా నిషేధించారు..?: మోహన్ భాగవత్

"దేశంలో ప్రధాని మోదీ, బిహార్‌లో సీఎం నీతీశ్ కుమార్ ఉపాధిని నాశనం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కోరుకోవడం లేదు. స్థానికంగా అనేక పంటలు పండుతాయి. కానీ, 20 ఏళ్లలో ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. ఎప్పుడైనా ప్రజలతో మాట్లాడితేనే కదా.. వారి అవసరాలు తెలుసుకునేది" అని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలో (%దీఅష్ఘుతీ చీవఒం%) విద్యారంగాన్ని మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

# ఆడ్వాణీపై శశిథరూర్ ప్రశంసలు

మొదటి పేజీ తరువాయి

శనివారం ఆడ్వాణీ 98వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ థరూర్ ఈ పోస్టు చేశారు. ఆడ్వాణీని ప్రశంసిస్తూ..థరూర్ చేసిన పోస్టుపై కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆడ్వాణీకి మోదీ జన్మదిన శుభాకాంక్షలు

శశిథరూర్ కొంత కాలంగా మోదీ సర్కారుకు, కేంద్ర ప్రభేత్వానికి అనుకూల వ్యాఖ్యలు చేస్తుండడంతో సొంత పార్టీ నేతలు ఆయనను వ్యతిరేకిస్తున్నారు. ఈక్రమంలో ఆయన భాజపా లో చేరడం ఖాయమనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. కాగా ఈ వార్తలను థరూర్ పలుమార్లు కొట్టిపడేశారు. తాను ఎప్పటికీ కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

# రాసిపెట్టుకోండి.. 2034 వరకూ మాదే అధికారం: 'మీట్ ది ప్రెస్'లో సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలే కారణం. అభివృద్ధి మాత్రమే కాదు.. సంక్షేమంలోనూ వారు తమదైన ముద్ర వేశారు. 2004-2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉంటూ హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశాయి.

**అన్ని రంగాల్లోనూ కేసీఆర్ ప్రభుత్వం విఫలం..**

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో త్యాగాలు చేసింది. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి 4 కోట్ల మంది ప్రజలకు ఇచ్చింది. భారత రాష్ట్ర సమితి హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా? కాళేశ్వరం లేకుండానే మా ప్రభుత్వం అత్యధికంగా వరి పంటను ఉత్పత్తి చేసింది. గత పాలకులు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులన్నీ పెండింగులోనే పెట్టారు. ఎలాంటి ప్రయోజనం లేని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం మాత్రమే కేసీఆర్ పూర్తిచేశారు.

**కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతివ్వలేదు**

కేటీఆర్ జీవితంలోనే అధికారం అనే రేఖ లేదు. కుమారుడి విషయంలో కేసీఆర్ ధ్రుతరాష్ట్రుడిలా మారారు. కేటీఆర్ దశే బాగాలేకపోతే కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ఏం లాభం? కేటీఆర్ ఎన్నికల ప్రచారం పుష్ప సినిమాలో శ్రీలీల ఐటమ్‌సాంగ్‌ను గుర్తుకు తెస్తోంది. 3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్ని కూడా నేను రద్దు చేయలేదు. వాటిని కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్తపథకాలు తీసుకొచ్చాను. ఎస్సీ వర్గీకరణపై ఎవరూ చేయని సాహసం చేశాను. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపాను. దేశంలో ఎవరూ చేయని కులగణనను రాష్ట్రంలో చేసి చూపించాను. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించాను. మహిళలకు ఉచిత ప్రయాణం సహా అనేక ఎన్నికల హామీలు నెరవేర్చాను.

**భాజపాకు డిపాజిట్ వస్తే దేశం మొత్తం గెలిచినట్లే**

రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు గుజరాత్ తరలి వెళ్లేందుకు భాజపా నేతలు కృషి చేస్తున్నారు. సెమీ కండక్టర్ల కంపెనీ ఆ రాష్ట్రానికి తరలించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి యత్నిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాది ఫెవికాల్ బంధం. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాం. ఇప్పటి వరకు విచారణ ఎందుకు ప్రారంభించలేదు? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ తెచ్చుకుంటే భాజపా దేశం మొత్తం గెలిచినట్లే. మరో 8 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. నేను చెప్పేది రాసి పెట్టుకోండి.. 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుంది"అని రేవంత్ అన్నారు.

# ఇన్నాళ్లూ సీఎం రేసులో ఒక్కరే.. ఇప్పుడు ఇద్దరు: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: దగ్గరివాళ్లు చెప్పినా వినే పరిస్థితిలో సీఎం రేవంత్‌రెడ్డి లేరని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ప్రశ్నిస్తే పాలన మీరే చేయండంటూ ఎదురుదాడికి దిగుతున్నారని, అలాంటప్పుడు అధికారం నుంచి దిగిపోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి కంటే ఎవరైనా బాగానే పాలన చేస్తారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో నిర్మాణ రంగాన్ని ఖతం చేశారని విమర్శించారు. బయటివాళ్లకు అధికారం ఇవ్వాల్సిన అవసరం లేదని, పార్టీలో ఉన్న వ్యక్తులకే ఇవ్వొచ్చని వ్యాఖ్యానించారు. నిన్నటిదాకా భట్టి విక్రమార్క మాత్రమే సీఎం రేసులో ఉండేవారని, ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా పోటీలో ఉన్నారని అన్నారు.

ఆదివారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. " సర్పంచ్ ఎన్నికలకు తిరిగినట్లు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ సందుసందుకు తిరిగారు. ప్రెస్‌క్లబ్ పబ్‌లా కనిపిస్తోందని.. స్టార్ హోటల్‌లో మీట్ ది ప్రెస్ పెట్టారు. రూ.3 వేల కోట్లతో ఉస్మానియా, 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మాణం, ఆర్టీసీకి రూ.7వేల కోట్ల లాభం తెచ్చినట్లు చెప్పుకొన్నారు. 20వేల నోటిఫికేషన్లు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అసలు ఒక్క నోటిఫికేషన్ అయినా వచ్చిందా? నిరుద్యోగులు జూబ్లీహిల్స్‌లో నామినేషన్ వేసి కాంగ్రెస్‌ను ఓడించాలని తిరుగుతున్నారు.

# పీడిత ప్రజల విముక్తికి నూతన ప్రజాస్వామిక విప్లవమే ఏకైక మార్గం

» ఖిలా వరంగల్ లో ఘనంగా సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతి సభ





**కరపత్రం ప్రతినిధి వరంగల్ నవంబర్ 9**
సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలు జరపాలని ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం ఖిలా వరంగల్ పడమరకోట లోని విద్యార్థి అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రధాన కార్యదర్శి గోదావరి లోయ కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు పిడిఎస్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్ మర్రి మహేష్ లు మాట్లాడారు. ముందుగా విప్లవోద్యంలో అసువులు బాసిన నాయకులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నార ని సిపిఐ సిపిఎం రివిజనిస్టు రాజకీయాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా, పోరాట యోధుల్ని ఏకం చేస్తూ సిపిఐ ఎంఎల్ పార్టీ ఏర్పాటుకు కృషి చేశాడని వారు అన్నారు. అంతేకాక గోదావరి నది పరివాహక ప్రాంతంలోని అటవీ మైదాన ప్రాంతాలలో గిరిజన గిరిజనేతర పేదలను కూడగట్టి ప్రతిఘటనా పోరాటాలు నిర్మించి 10 లక్షల ఎకరాలకు పైగా పేద ప్రజలు సాగు చేసుకొనుటకు నాయకత్వం వహించాడని వారు తెలిపారు. కేంద్రంలోని మోడీ అమిత్ షా ల ప్రభుత్వం పార్లమెంటును అడ్డం పెట్టుకొని బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలకు దళారీగా పనిచేస్తుందని వారు విమర్శించారు. మధ్య భారతంలో అమలు జరుపుతున్న ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ నాయకులు నళిగంటి విజయ పాల్ బండి కుమార్ బన్న నర్సింగ్గం మహమ్మద్ ఖాన్ గద్దల ప్రభాకర్ గంద్రతి హరిబాబు మైదం సంజీవ సుద్దాల వీరయ్య మన్ని నారాయణ, సాంబయ్య బండి వెంకటేశ్వర్లు లతోపాటు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు..

» బీజేపీని గెలిపించేందుకు తహతహలాడుతున్న బీఆర్ఎస్
» గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ..
» ఓటమి తప్పదని తెలిసే.. కాంగ్రెస్ పార్టీ పై ఇరు పార్టీల తప్పుడు ప్రచారం..
» జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు







**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 9**
కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఉందని, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి మద్దతుగా.. వెంగళరావు నగర్ 99వ డివిజన్ పరిధిలోని 211, 212, 213, 214, 215, 216 బూతుల పరిధిలో మాజీ గద్వాల జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య, కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ హిందూ ప్రియా తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమంలో ఇంటింటికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగరాజు గారిని ప్రజలు సాధారణంగా ఆహ్వానించి శాలువాతో సత్కరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రధానంగా కాలనీలో నీటి, విద్యుత్ వైర్ల సమస్యలు ఉన్నాయి అని నా దృష్టికి వచ్చిందని అభ్యర్థి గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలియజేస్తూ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆత్మవిశ్వాసం కాంగ్రెస్ పక్షాన స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ తెర వెనుక పనిచేసింది. ఈ సారి కూడా బీజేపీకి లాభం చేకూర్చేందుకు ఇరు పార్టీలు కలిసి కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రజలు ఈసారి ఆ మాయమాటలకు లోబడరని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు బీజేపీని గెలిపించేందుకు తహతహలాడుతున్న బీఆర్ఎస్ గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పనిచేసిన బీఆర్ఎస్ ఓటమి తప్పదని తెలిసే.. కాంగ్రెస్ పై ఇరు పార్టీల తప్పుడు ప్రచారం. ఈ రెండు పార్టీల పట్ల జూబ్లీహిల్స్ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నవంబర్ 11వ తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గారికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే నాగరాజు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇన్చార్జులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 10 నుండి 15 వరకు బీసీల ధర్మ పోరాట దీక్ష



- పార్టీలకతీతంగా, కులాల కతీతంగా బీసీలంతా సంఘటితమై దీక్షలో పాల్గొనండి
- బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ జరగాల్సిందే
- కేయూ బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 9**
నవంబర్ 10 నుండి 15 వరకు ఎస్డీ ఎల్సీ మహాత్మా జ్యోతిరావు పూలే ప్రాంగణంలో బీసీల ధర్మ పోరాట దీక్షను నిర్వహించడం జరుగుతుందని ఈ దీక్షలో పార్టీలకతీతంగా కులాలకతీతంగా బీసీలంతా సంఘటితమై దీక్షలో పాల్గొనాలని, అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు, అన్ని విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని బీసీల ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ బీసీ జేఏసీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల దీక్ష తెలంగాణ ఉద్యమ తరహాలో జరగబోతుందని, తెలంగాణ ఉద్యమం ఇదే పోరాటాల ఓరగల్లు గడ్డపైన కాకతీయ యూనివర్సిటీలో పురుడు పోసుకుందని, అదే గడ్డ నుంచి బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాటానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. ఇక్కడి నుంచే బీసీ ఉద్యమం కూడా ప్రారంభం అవుతుందన్నారు. అదే విధంగా విద్యార్థులతోనే ఏ ఉద్యమమైన బలోపేతం అవుతుందని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాడు పిడికిలి బిగించి ఎందరో విద్యార్థులు అమరులయ్యారని అమరులయ్యారని, విద్యార్థుల త్యాగ ఫలితం మూలంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, అదే స్ఫూర్తితోనే నేడు బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో మేమెంతో మాకంతా వాటా దక్కేంతవరకు కూడా పోరాటం ఆపేది లేదని, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాన్ని ఉధృతం చేసి, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి..రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేంతవరకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేంతవరకు పోరాటం కొనసాగుతుందని, బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత చేసేంతవరకు పోరాటాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు వంగాల సుధాకర్, కాకతీయ యూనివర్సిటీ బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు సుమన్ రాజ్, అజయ్ సింగ్, గణేష్, రాజశేఖర్, అన్వేష్, నితిన్, సాయి, వరుణ్, రోహిత్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్లను చంపకండి - బ్రతకనీయండి!

» పెన్షనరీ బకాయిలు వెంటనే చెల్లించి, ఆత్మ హత్యలు (ప్రభుత్వ హత్యలు) ఆపండి
» స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణ (ఎస్ జి పి ఎ టి) రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ డిమాండ్






**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 9**
మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల కు వారికి రావలసిన పెన్షనరీ బకాయిలు సకాలంలో రాక అప్పులు కట్టలేక, పిల్లల పెళ్ళిళ్ళు,చదువులు ఆగిపోయి అవమాన భారంతో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుండగా, మరికొందరు వృద్ధాప్యంలో అనేక రుగ్మతలతో ఆసుపత్రుల పాలై ఖర్చులు భరించలేక మరి మరికొందరు రుగ్మతలు వికటించి అశువులు అసువులు బాపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నిటికీ కారణం రాష్ట్ర ప్రభుత్వం పెన్షనరీ బకాయిల ను గత 20 నెలలుగా చెల్లించకపోవటమే అని, ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా భావించవలసి ఉంటుందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణ (ఎస్ జి పి ఎ టి) రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ అన్నారు. ఆదివారం ఎస్ జి పి ఎ టి కాశీబుగ్గ యూనిట్ సమావేశం వరంగల్ గిర్మాజీపేట లోని విద్యానికేతన్ పాఠశాలలో ఎం డి మదార్ సాహెబ్ అధ్యక్షతన జరుగగా.., ముఖ్య అతిథిగా వెలిశోజు రామ మనోహర్ పాల్గొని ప్రసంగిస్తూ.. 17-11-2025 నాడు హైదరాబాద్ లోని ఇందిరా పార్క్,ధర్నా చౌక్ లో పెన్షనర్స్ జె ఏ సి ఆధ్వర్యంలో పెన్షనర్స్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. నిర్వహించే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఒక వైపు డి ఆర్ లు పెండింగ్,పి ఆర్ సి ఊసే లేదు,మెడికల్ బిల్లులు సంవత్సరం దాటినా రావు, హెల్త్ స్కీమ్ ప్రచారానికే పరిమితం అయింది,ఇప్పటికైనా పెన్షనర్లు ఎదుర్కొంటున్న బాధలకు పరిష్కారం చూపాలని, జి పి ఎఫ్, జి ఐ ఎస్,జి ఎల్ ఐ, లీవ్ ఎన్కాష్మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యుటీ తదితర బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు జి వీరాస్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రు సుధీర్ బాబు,టి పురుషోత్తం, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు తుమ్మ వీరయ్య,గునిగంటి సాంబయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి యన్ సదానందం, వివిధ యూనిట్ల బాధ్యులు డా. అల్లం వేణు మాధవ్, జి నరసింహ రాములు,గూడూరు శ్రీనివాస్ రావు, కె కృష్ణకుమార్, కె కుమార స్వామి, ఆడెపు భిక్షపతి, కందగట్ల యాదగిరి, కూనమల్ల సారంగపాణి, ఇ ముత్యాలు, కె వీరకుమార స్వామి, ఎం కె మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం నూర్ భాషా/దూదేకుల బిసి - బి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా అహ్మద్ పాషా



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 9**
తెలంగాణ స్టేట్ ముస్లిం నూర్ భాషా/దూదేకుల బిసి-బి వెల్ఫేర్ అసోసియేషన్ అహ్మద్ పాషా నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ముస్లిం నూర్ భాషా/దూదేకుల బిసి-బి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ నియామక పత్రాన్ని ఆదివారం హైదరాబాదులోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో అహ్మద్ పాషా కు అందజేశారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, దూదేకుల ఫెడరేషన్ స్థాపించడానికి యువజన విద్యార్థులను ప్రోత్సహిస్తానని అహ్మద్ పాషా తెలిపారు. తన నియమాగానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# నిత్యం ప్రజాసేవకై పరితపించే ప్రజా నాయకుడు గండ్ర సత్యన్న

» పోలినేని లింగారావు
» ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గండ్ర సత్యన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 8**
నిత్యం ప్రజా సేవకై పరితపించే ప్రజా నాయకుడు గండ్ర సత్యనారాయణ రావు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలినేని లింగారావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జన్మదినం సందర్భంగా పోలినేని లింగారావుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరం సమ్మయ్య, శ్రీహరి గౌడ్ లు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గండ్ర సత్యనారాయణ రావును మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయనకు తినిపించారు. ఈ సందర్భంగా పోలినేని లింగారావు మాట్లాడారు. పదవిలో ఉన్న, లేకున్నా ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే నాయకుడు గండ్ర సత్యనారాయణ రావు అని, ఆయన భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుండి ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడిగా ఎక్కువ నిధులను తీసుకొచ్చి, భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పదం వైపు నడిపిస్తున్న రథసారథి అని కొనియాడారు. ఆయన ఆ పరమేశ్వరుని కృపతో, ప్రజల ఆశీస్సులతో నిండు నూరేళ్లు కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో గడపాలని, ఆయన ఎంచుకున్న మార్గంలో మరిన్ని ఉన్నతమైన పదవులను అలంకరించి..ప్రజాసేవలో పరితపించాలని ఆకాంక్షించారు.

# ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ -2025 బ్రోచర్ ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 9**
జీవీఆర్ కరాటే ఆకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన హైదరాబాద్, బషీర్ బాగ్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో 20వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ 2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జివిఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం కాచిగూడ లోని కార్పొరేటర్ కార్యాలయంలో కరాటే చాంపియన్ షిప్ బ్రోచర్ ను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరాటే అనేది పిల్లలకు స్ఫూర్తిని కలిగించడమే కాకుండా, వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడానికి ఒక మంచి వేదిక లభిస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, కరాటే మాస్టర్ ప్రవీణ్ చారి, ప్రదీప్, కరీం, బీజేపీ నేతలు లావణ్య, బి.భీమ్ రాజ్, ఎస్.రవియాదవ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 134వ అఖిల భారత బ్రహ్మా సమాజ్ సమావేశాలు

▶ వేదపారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగాలతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన వక్తలు



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 9**
హైదరాబాద్ దక్కన్ బ్రహ్మ సమాజ్ ఆధ్వర్యంలో కాచిగూడ లోని మున్నూరుకాపు భవన్ రెండు రోజుల పాటు నిర్వహించిన 134వ అఖిల భారత బ్రహ్మ సమాజ్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. వేదపారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగాలతో వక్తలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోప చందా మాట్లాడుతూ భగవంతుడితో స్నేహం అనేది మానవుడికి లభించిన అత్యంత వరం అని అన్నారు. కళబ్యూణి చటోపాధ్యాయ, రాజారామ్మోహన్ వంటి మహనీయుల ఆధ్యాత్మిక సేవలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. మరో ఆధ్యాత్మికురాలు మధుబింధు మాట్లాడుతూ.. జీవితంలో కృతజ్ఞత, ఆత్మజ్ఞానం వంటి విలువల ప్రాధాన్యతను వివరించారు. యువత సమాజ సేవలో భాగస్వాములై బ్రహ్మ సమాజ విలువలను విస్తరింప చేయాలన్నారు. వేదభ్యాసం అందరికీ అందుబాటులో ఉండేలా దక్కన్ బ్రహ్మ సమాజ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో రేఖా సహాని, శ్రీరథీ శంకర్, డాక్టర్ వివి లక్ష్మీనారాయణ, దాసరి భారత ప్రసాద్, డాక్టర్ నిమేష్ ప్రభు, బి. ఆత్మీ, డాక్టర్ శోభారాయ్, దేవవ్రత సర్కార్, సర్వేష్ నాయక్, అజయ్ గౌతం, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం నవంబర్ 10 2025

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి

» నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయం
» మెదక్ జిల్లా మాసాయిపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ నాగిరెడ్డి



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట నవంబర్ 9**
తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత రెండవ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికార బాధ్యతలు రెండు సంవత్సరాలు పరిపాలన సజావుగా సాగిందని తెలంగాణ రాష్ట్రంలో మూడవసారి అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి వాగ్దానాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎన్నో అభివృద్ధి పనులను చేస్తామని చెప్పినటువంటి వాగ్దానాలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఇప్పటికే ఇచ్చినటువంటి వాగ్దానాలు నెరవేర్చరనిమరిన్ని అభివృద్ధి పనులను నెరవేర్చే ప్రయత్నంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నానని ఆయన తెలియజేశారు ఇకముందు కూడా ఎన్నో అభివృద్ధి పనులను చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెల పొందడం ఖాయమని ఆయన జాతీయ భూమి ప్రతినిధితో చరవనిలో మాట్లాడారు తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేని పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధిని గౌరవాలే కానీ లేనిపోని ఆరోపణలు చేస్తూ మళ్ళీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ఉద్దేశంతో పరిపాలన సజావుగా సాగిస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం పై లేనిపోని ఆరోపణలు చేసి ఓటరును మభ్యపెట్టి ప్రయత్నంలో ప్రతిపక్ష నాయకులు ఉన్నారని అలాంటి ఆరోపణలను పట్టించుకోని వారు తెలంగాణ రాష్ట్రంలో లేరని ఇకనైనా పది సంవత్సరాలు టిఆర్ఎస్ పరిపాలన లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏమి ఉద్ధరించింది అని ఆయన మండిపడ్డారు ఇకనైనా మీ యొక్క ఆరోపణలను మానుకొని మీరు 10 సంవత్సరాల లో మీ సంపాదన ఎంత సంపాదించుకున్నారు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుసునని అందుకే బి.ఆర్.ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడి మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పరిపాలన రావాలని ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్ర పరిపాలన అప్పగించడం జరిగిందని ఆయన తెలియజేశారు మరోసారి జూబ్లీహిల్స్ నియోజవర్గంలో జరుగుతున్న ఎన్నికల ఫలితమే బి ఆర్ ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని టిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై లేని కొన్ని ఆరోపణలు మానుకోవాలని ఆయన తెలియజేశారు టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను గత రెండు సంవత్సరాల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని గత టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని కోలుకోలేని పరిస్థితులను అప్పుల పాలు చేసిన ఘనత గత పది సంవత్సరాల పరిపాలనలను బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని అక్రమంగా ఎన్నో ఆస్తులను సంపాదించుకున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు ముసుకు దొంగలుగా అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాలకు అడ్డు లేకుండా ఆస్తులను సంపాదించుకున్న బడా నాయకులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు అని టిఆర్ఎస్ పార్టీ నాయకుల చరిత్రలు చీమలు పెట్టిన పుట్టలుగా ఒక్కొక్కరి చరిత్ర తిరగ రాయనున్న కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక మూడు సంవత్సరాల లో టిఆర్ఎస్ పార్టీ నాయకుల చరిత్రలకు చరమగీతం పాడుతారని ఆయన తెలియజేశారు

## లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బాలాజీ నగర్ , శ్రీనిధి సేవా కార్యక్రమం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 9**






జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బాలాజీ నగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీనిధి సంయుక్తంగా కరీంనగర్ జిల్లా జైలులో ఖైదీలను సందర్శించే వారి కోసం 10 సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యాన్ని జిల్లా గవర్నర్ లయన్ ఎస్. కొదంద రామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా జైలుకు వచ్చే సందర్శకులు వేచి ఉండటానికి తగిన సౌకర్యం లభించడం పెద్ద సేవగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సుధాకర్ రెడ్డి క్లబ్ చేసిన సేవా కార్యక్రమాన్ని అభినందించి, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు షుగర్ నిర్ధారణ పరీక్ష , బిపి పరీక్షలు లయన్స్ డయాగ్నస్టిక్ ద్వార చేయడం జరిగిందనీ , క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలలో భాగముగా బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ 3000కరపత్రాలు విడుదల చేసి పంపిని చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ రవీందర్ రెడ్డి, లయన్ కుమార్ రెడ్డి, ఐపీఎంసీసీ లయన్ హన్మండ్ల రాజి రెడ్డి, కోఆర్డినేటర్ లయన్ రాధాకృష్ణ రెడ్డి , ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్, గవాయిపై జరిగిన దాడికి నిరసనగా ఈ నెల 17 న ఛలో ఢిల్లీ

- చట్టపరమైన వ్యవస్థలన్ని దళితులను అంటరానివారిగా చూస్తున్నాయి.
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ.



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట నవంబర్ 9**
దేశ రాజధానిలో అత్యున్నత న్యాయవ్యవస్థగా ఉన్న సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ గారి మీద దాడి జరిగి నెల రోజులు కావస్తున్న ఇప్పటికీ కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ నవంబర్ 17 న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని , ఢిల్లీలో పెద్ద ఎత్తున దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ , ఎంఎస్పి రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగలు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి,మరియు అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం మాయ గార్డెన్ లో జిల్లా ఇంచార్జి బొజ్జ సైదులు మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ " సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని అన్నారు. ఈ దాడి జరిగి నెల రోజుల కావస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమని అన్నారు. జస్టిస్ గవాయ్ గారి స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జీ ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండే వారా? అని ప్రశ్నించారు. అందుకే జస్టిస్ బిఆర్ గవాయ్ మీద జరిగిన దాడి దళితులపైన జరిగిన దాడిగా చూస్తున్నామని అన్నారు. దళితులు ఎంత ఉన్నత స్థానానికి కష్టపడి ఎదిగినా కుల రక్కసి వెంటాడుతుందని అన్నారు. అందుకే డిల్లీ పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. న్యాయవ్యవస్థ ,జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరించుకుండా కుల వివక్షతను పక్షపాతాన్ని చూపాయని అన్నారు. అందుకే గవాయి గారిపై దాడి ఘటనను నిరసిస్తూ జాతీయ స్థాయిలో దళితుల ఆత్మగౌరవ పోరాటం చేపడుతున్నామని అన్నారు. కానీ 12 రోజులుగా ఎదురు చూస్తున్నా నేటికీ న్యాయం జరగలేదని అన్నారు. ఉద్యమానికి పిలుపునివ్వడం జరిగిందని తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు చేయాలి. నిందితుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలి. అలాగే ఈ ఘటన మీద సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జీ చేత విచారణ జరిపించి దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించాలి. ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని అన్నారు. ఈ ఘటన జరిగి నెల రోజులు దాటినా చట్టపరమైన వ్యవస్థలు ఏ చర్య కూడా తీసుకోలేదు. ఇది రాజ్యాంగ పరిధిలో పని చేస్తున్న చట్టపరమైన వ్యవస్థలు దళితుల పట్ల పాటిస్తున్న అంటరానితనానికి నిదర్శనం. చీఫ్ జస్టిస్ గారిపై దాడి విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 17 న ఛలో ఢిల్లీ " దళితుల ఆత్మగౌరవ ర్యాలీ" నిర్వహిస్తామని , ఈ ర్యాలీలో ఆత్మగౌరవంతో జీవించాలని కోరుకునే దళిత ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జాతీయ నాయకులు సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ సంగారెడ్డి ఇంచార్జ్ రామారావు శ్రీనివాస్ మాదిగ ఎంఎస్పి ఉమ్మడి జిల్లా కోయిన్చార్జ్ మల్లిగారి యాదగిరి మాదిగ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చింద్ర సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ అధికార ప్రతినిధి ఎన్నెల్లి సుధాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మలిశెట్టి రవి మాదిగ, మెదక్ విహేచ్ పియస్, జిల్లా అధ్యక్షులు బాచుపల్లి పండు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దండు శంకర్ సిద్దిపేట జిల్లా దేవరపల్లి అశోక్ కుమార్ హావేళ్ళి ఘణపూర్ మండల ఎంఎస్ఎఫ్ నాయకులు మస్కురి కిరణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ హావేళ్ళి ఘణపూర్ మండల నాయకులు స్వామి మహిళ నాయకురాలు మాధవి స్వరూప పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ బూడిద టెండర్లలో టెండర్ల లావాదేవీలపై సిబిఐచే విచారణ జరిపించాలి

– ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కదారి సునీల్ ప్రత్యేక విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), నవంబర్ 9:**



ఎన్టీపీసీ బూడిద టెండర్ లో జరుగుతున్న అవినీతి అరాచకాలు. రోజురోజుకు పెరుగుతూ బూడిద మాఫియా పెరిగిపోవడానికి ఎవరు కారణం అవుతున్నారో. గత పది సంవత్సరాల నుండి టెండర్ల గోల్మాల్ లో ఎవరెవరికి చేతులు మారాయో విషయాలు బయటకు రాబట్టడానికి. సి.బి.ఐ.చే పూర్తి విచారణ జరిపితే కోట్ల రూపాయలు లావాదేవీలు లెక్కలు బయట పడతాయని వెంటనే సిబిఐ వారిచే విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వానికి ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఎన్టిపిసి బూడిదతో పక్క గ్రామాలు విలవిలలాడుతుంటే నష్టం ఒకరికి సోకు మరోకరికి దక్కుతుందని ఆరోపించారు. లక్షల కోట్ల బూడిద దందా నడుస్తున్న చేతులు మారుతున్న మాఫియా పెరుగుతున్న పట్టించుకుని కంట్రోల్ లో పెట్టే వారే కరువయ్యారని, పది సంవత్సరాల కాలంలో జరిగిన బూడిద టెండర్ల రోజువారి లెక్కలు ఎన్టిపిసి యాజమాన్యం మాయ చేస్తుందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణకు ఆదేశించాలని కోరారు

## వివేకానంద కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ రక్తదానం:

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 9**



స్థానిక వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న హర్షవర్ధన్ రెడ్డి రక్తదానం చేసినట్టు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపోలో హాస్పిటల్ లో గుండె ఆపరేషన్ కోసం నిన్న అడ్మిట్ అయినటువంటి కరీంనగర్ పట్టణంలో జ్యోతి నగర్ నివాసి రాపాల మాధవికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం 4 యూనిట్లు అవసరం కాగా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ హర్షవర్ధన్ రెడ్డి స్పందించి రక్తదానం చేయడం జరిగిందని అని తెలిపారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ ఏ సి ఓ బి సంపత్ కుమార్ ఏవో బి శ్రవణ్ కుమార్ తదితరులు అభినందించారు.

# పేరుకే కొనుగోలు కేంద్రాలు







- రోడ్ల పైనే పరిమితమయిన వరి ధాన్యం
- ఎక్కడ కనిపించని ఐకెపి సెంటర్
- తీరని రైతుల కష్టాలు

**కరపత్రం ప్రతినిధి అందోలు ప్రతినిధి:**
అందోలు నియోజకవర్గం అందోలు మండల కేంద్రంలోని ఎక్కడ చూసినా కుప్పలు కుప్పలుగా వరి ధాన్యం రోడ్ల పైనే పరిమితమయినయి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల గురించి రైతు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వరి ధాన్యం మాత్రం రోడ్ల పైనే పరిమితమైంది. మండలంలోని జాతీయ రహదారికి అనుకొని ఉన్న దాదాపు చాలా గ్రామాలలో చూస్తే పూర్తిగా వరి ధాన్యం జాతీయ రహదారికి ఇరువైపులా దారి పొడవున కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడ చూసినా వరి కొనుగోలు కేంద్రాల సిబ్బంది ఐకెపి సొసైటీ సిబ్బంది కానీ ఎక్కడ కనిపించిన దాఖలు లేవు. పేరుకు మాత్రం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వరి కొనుగోలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఎంతో కష్టపడి పండించిన పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులకు గురి చేస్తుందని రైతుల గోడు వినిపిస్థలేదా అని ప్రశ్నించారు ఈ వరి ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారు మా అప్పులు ఎప్పుడు తీరుస్తాము అని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం చివరి రోజు..

» అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్..!!

**హైదరాబాద్ (జూబ్లీ హిల్స్ )నవంబర్ 9 కరపత్రం ప్రతినిధి**
జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారం నేటి సాయంత్రంతో ముగిసింది అసలే ఆదివారం సెలవు. అభ్యర్థులు ఉదయాన్నే ఓటర్ల డోర్లు తడుతున్నారు. ఉన్నది ఒక్కటే రోజు.. ఎల్లుండే పోలింగ్.. ఎవరినైనా మిస్ అయ్యామా..? అనే అంతర్మథనంలో పడుతున్నారు. తాయిళాలు మొదలుపెట్టి గెలుపు కోసం INC, BRS, BJP సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. సామ దాన భేద దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. ఎంత చేసినా సైలెంట్ ఓటింగ్ అభ్యర్థుల్లో టెన్షన్ను పెంచుతోంది..

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన తుఫాన్- ఒకరి మృతి..

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా కంది మండలం కవలంపేట వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన తుఫాన్ వాహనం ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో నారాయణఖేడ్ మునిసిపల్ పరిధిలోని చాంద్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన శనిగారం బాలయ్య (50) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడినవారిని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం దాటికి తుఫాన్ వాహన ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాధితులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.